క్లుప్తంగా

వర్షపు నీరు నిల్వలపై ఆరా



వర్షపునీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

నగరి : ఇటీవల కురుస్తున్న వరుస వర్షాలకు నివాసాల చుట్టూ నీరు చేరిన నగరి మున్సిపాలిటీ ఒకటో వార్డులోని నివాసాలను మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ కన్నియప్ప, కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఆదివారం పరిశీలించారు. నీరు నిల్వ చేరడానికి కారణాలను ఆరాతీశారు. డ్రైనేజీ కాలువలో నిలిచిపోయిన నీరు బయటకు పోవడానికి శాశ్వత పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని స్థానికులకు భరోసా ఇచ్చారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత



ఆస్పత్రిలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

నగరి : ప్రస్తుత ప్రభుత్వంలో పింఛన్ లబ్ధిదారులను వెతుక్కుంటూ వెళ్తోంది. మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామానికి చెందిన పెన్షనర్ జానకమ్మ ఇటీవల అనారోగ్యం బారిన పడి తిరుపతిలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో స్థానికంగా పెన్షన్ తీసుకునేందుకు ఆమె అందుబాటులో లేదు. ఆమెకు పెన్షన్ అవసరాన్ని గుర్తించిన వెల్ఫేర్ అసిస్టెంట్ నిసార్ అహ్మద్ తిరుపతిలో వృద్ధురాలు చికిత్స పొందుతున్న ఆస్పత్రికే వెళ్లి పెన్షన్ అందజేశారు. తన అవసరాన్ని గుర్తించి శ్రమకు ఓర్చి వచ్చి పెన్షన్ అందించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపింది.

80 శాతం పింఛన్ పంపిణీ



పాలసముద్రం: వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్ పంపిణీ మొదటి రోజే సోమవారం 80 శాతం పింఛన్ పంపిణీ చేశామని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలో 3,699 మందికి పింఛన్లు అందించారు. అందులో 2,950 మందికి పింఛన్ అందించారు. వలంటీర్లు తెల్లవారుజామున నుంచే లబ్ధిదారుల తలుపు తట్టి పింఛన్ పంపిణీ చేశారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 15 వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ కెవెఎల్ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాచపాళెం సచివాలయ పరిధిలో ఎస్టీ ఉమెన్ 1, ఎస్సీ ఉమెన్ 1, సత్యనారాయణ కాలనీ బీసీఏ ఉమెన్ 1, బీసీబీ ఉమెన్ 1, బీసీడి ఉమెన్ 1, దాసరిగుంట బీసీబీ ఉమెన్ 2, గోవిందపాళెం ఎస్సీ ఉమెన్ 1, ఓసీ ఉమెన్ 1, లక్ష్మీనగర్ బీసీబి ఉమెన్ 1, కల్యాణపురం ఎస్సీ 1, ఎస్టీ 1, ఆరేటమ్మకాలనీ ఎస్సీ 1, పిల్లారిపట్టు బీసీఏ ఉమెన్ 1, బీసీబి 1కి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 10వ తరగతి ఉత్తీర్ణత, ఆపై విద్యార్హత కలిగి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 10వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించి, 12వ తేదీన పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత కుటుంబసభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని బెంగళూరుకు చెందిన శాశ్విక్ కుటుంబసభ్యులు ఆలయ అధికారులకు అందజేశారు. ఆదివారం మధ్యాహ్నం దాత కుటుంబసభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

అట్టహాసంగా స్వచ్ఛతా హి సేవ

- పట్టణ, గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేసిన ప్రజాప్రతినిధులు
- నగరి మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ



నగరి: శ్రమదానం చేస్తున్న చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

నగరి : ప్రధానమంత్రి స్వచ్ఛతా హి సేవా పిలుపు మేరకు, ఏక్ ఘంటా–ఏక్ తారీఖ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి రోడ్లు ఊడ్చి శ్రమదానం చేశారు. టవర్‌క్లాక్ జంక్షన్ నుంచి పుదుపేట వరకు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి చీపురు పట్టి రోడ్లను శుభ్రపరచడం, రోడ్ల పక్కన ఉన్న చెత్తను తొలగించడంతో పాటు ప్రతి ఒక్కరూ ప్రాంతాల్లో ఒక గంట పాటు శ్రమదానం చేయాలంటూ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిల్లర్లు గోపాల్ రెడ్డి, దయానిధి, ఇంద్రయ్య, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.పురుషోత్తం, వార్డు పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, పారిశుద్ధ్య మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో..

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్స్ స్వచ్ఛతా హి సేవా ఏక్ గంట–ఏక్ తారీఖ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీజీ విగ్రహాన్ని శుభ్రం చేసి, పాఠశాల పరిసరాలలో చెత్తాచెదారం, కలుపు మొక్కలను శుభ్రం చేశారు. అనంతరం లెఫ్టినెంట్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనలో ప్రభుత్వం దృఢ సంకల్పాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఏడాది పాటు క్రమం తప్పకుండా తమ సమయాన్ని పరిశుభ్రత కోసం వెచ్చిస్తామని కేడెట్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు.

మొక్కలతో ర్యాలీ..

స్వచ్ఛతా హి సేవా ఏక్ గంట–ఏక్ తారీఖ్ కార్యక్రమంలో భాగంగా ప్రైవేటు పాఠశాల విద్యార్థులు మొక్కలతో పట్టణ పరిధిలో నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది. ప్రతి విద్యార్థికి ఇచ్చిన మొక్కను వారు ఇంటి వద్ద నాటి పెంచాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండల కేంద్రం గంగాధర నెల్లూరు పంచాయతీలో నీవానది బ్రిడ్జి పైన గ్రామస్తులతో కలిసి కేసీసీ కంపెనీ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. పంచాయతీలోని హెల్త్ సబ్‌సెంటర్, అక్కన్నగారిపల్లి కండిగ గ్రామంలో ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ బ్యూటీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా, సచివాలయ సిబ్బంది వలంటీర్లు ఢిల్లీ యూత్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పాతగుంట, బొమ్మయ్యపల్లె, సంతబయలు పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ముళ్లకంపలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చొక్కా గోవిందయ్య, భువనేశ్వరి, రాజేశ్వరి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం) : పరిసరాల పరిశుభ్రతే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుకిరణ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం నాయకులతో కలసి పెనుమూరు సంతగేటు, బస్టాండ్ జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో చెత్తను ఊడ్చి, పిచ్చిమొక్కలను తొలగించి పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం, వలంటీర్లు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. ఆదివారం శ్రీబొమ్మరాజుపురంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా పంచాయతీ కార్యదర్శి ధరణి ఆధ్వర్యంలో గ్రామస్తులు శ్రమదానం చేపట్టారు. సర్పంచ్ అయ్యప్ప మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధుల రాకుండా అరికట్టవచ్చన్నారు. బలిజకండ్రిగ హైస్కూల్ హెచ్‌ఎం మనోహర్ నాయుడు విద్యార్థులతో కలసి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గోవిందరాజు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



వెదురుకుప్పం: పాతగుంట సర్పంచ్ భువనేశ్వరి ఆధ్వర్యంలో..



మొక్కలతో విద్యార్థుల ర్యాలీ



శ్రీబొమ్మరాజుపురంలో..



బలిజకండ్రిగ హైస్కూల్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న హెచ్‌ఎం



బస్టాండు ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నగరి: గాంధీ విగ్రహ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్



గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద..

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: పరిశుభ్రత ఆరోగ్యానికి మూలమని, ఈ విషయంలో ఎవరూ అశ్రద్ధ వహించరాదని పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర అన్నారు. ఆదివారం స్థానిక సబ్ కోర్టులో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 2న మన ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో ప్రారంభించారని తెలిపారు. మహాత్మగాంధీ కలలుగన్న పరిశుభ్రమైన భారతదేశాన్ని సాధించడమే లక్ష్యంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్టు పరిసరాల్లో చీపురు చేతపట్టి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకీ, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో

స్థానిక రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ పి.రామ్మూర్తి మాట్లాడుతూ సిబ్బందితో పాటు ప్రయాణికులు పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ప్రయాణికులచే స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రైల్వేస్టేషన్ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవెఎల్ఎన్‌రెడ్డి, ఎంఈఓ తిరుమలరాజు, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ సి.ఎం.దిలీప్‌మొదలి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ డి.పెరుమాళ్, స్టేషన్ మాస్టర్ పంకజ్‌కుమార్, కోఆప్షన్ మెంబర్ వి.షకీలా, ఎన్‌సీసీ మాస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు: కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న జడ్జిలు రాఘవేంద్ర, జానకి



పుత్తూరు: రైల్వేస్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జీవితకు ఉప ముఖ్యమంత్రి పరామర్శ



వైద్యురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు గ్రామంలో పాము కాటుకు గురై తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జీవితను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. ఈమె పొలం వద్ద పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ సీఎం తిరుపతికి వెళ్లి ఆస్పత్రిలో ఉన్న జీవితను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై వాకబు చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట మాంబేడు ఎంపీటీసీ మాజీ సభ్యుడు బండి రోశిరెడ్డి, నాయకులు ఉన్నారు.

అన్నూరుకు కొత్త సొబగులు







అన్నూరు గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం, సచివాలయం, గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ సేవలన్నీ ప్రజలకు గ్రామాల్లోనే అందుతుండడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి పంచాయతీలో ఇప్పటికే సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, పీహెచ్‌సీలు, స్కూళ్లు.. ఇలా ప్రజలకు అవసరమయ్యే ప్రతిదీ అందుబాటులో ఉన్నాయి.

- నేడు సచివాలయం, ఆర్బీకే, సీసీ రోడ్లను ప్రారంభించనున్న మంత్రి నారాయణస్వామి
- రూ.1.11 కోట్లతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కార్వేటినగరం: మండలంలోని అన్నూరు గ్రామంలో రూ.1.11 కోట్లతో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. డిప్యూటీ సీఎం నారాయణస్వామి వీటిని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక గ్రామస్తులు తమ ఊరిలోనే ప్రభుత్వ సేవలు అందుతుండడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఊరు దాటాల్సిన పని లేదు

అన్నూరు గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో ఆర్బీకే భవనంతో పాటు ఏళ్ల తరబడి వేధిస్తున్న సీసీ రోడ్ల సమస్య పరిష్కారం అయింది. సుమారు రూ.49 లక్షలతో ప్రభుత్వం సీసీ రోడ్లు వేసింది. గతంలో ఏ సమస్య వచ్చినా మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇకపై అలాంటి అవస్తలు ఉండవని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేసున్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం పనితీరుకు జేజేలు పలుకుతున్నారు.

దశ తిరిగిన గ్రామాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగేళ్లలో నియోజకవర్గంలోని గ్రామాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు అభివృద్ధి పథం వైపు నడుస్తున్నాయి. నాడు–నేడు ద్వారా సర్కారు స్కూళ్లను ఆధునీకరించి కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో బోధన అందిస్తోంది. సచివాలయాల వారీగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. దేశంలో ఏ ప్రభుత్వం చేయనంతగా రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఆర్బీకేల ద్వారా, అదే విధంగా ప్రభుత్వ పథకాలను వలంటీర్లు లబ్ధిదారులను గుర్తించి సచివాలయాల ద్వారా అందిస్తున్నారు. ప్రజలకు అవసరమయ్యే ప్రతి సమస్యను గ్రామాల్లోనే పరిష్కరించి అధికారులు, గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రజల మన్ననలు పొందుతున్నారు.

చెప్పలేని ఆనందం



మా గ్రామంలో సచివాలయ, ఆర్బీకే ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ధృవపత్రాల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉండేది. ఇక నుంచి గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు అందుబాటులో ఉంటారు. మా ఊర్లోనే ప్రభుత్వ సేవలు అందించిన ప్రభుత్వానికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– లోకనాథరెడ్డి, రైతు, అన్నూరు గ్రామం

ప్రారంభానికి సన్నద్ధం..



సచివాలయ భవనం, ఆర్బీకే భవన నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేశాం. మంత్రి నారాయణస్వామి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పరిశీలించాం. బిల్లులు చెల్లింపుల్లో జాప్యం లేకపోవడంతో పనుల్లో ఎలాంటి ఆటంకం కలగలేదు. ఈ భవనాలతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లను కూడా నేడు మంత్రి ప్రారంభోత్సవం చేస్తారు.

– మోహన్‌మురళి, ఎంపీడీఓ, కార్వేటినగరం మండలం

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న బాలాజీ

కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరంలో రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృద్ధులను ప్రేమగా చూసుకోవాలని సూచించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచిపెట్టారు. అలాగే వృద్ధాశ్రమం పరిసరాలను పరిశుభ్రంగా ఉండడంతో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు భరతనాట్యం, కూచిపూడి, గాయకులు భక్తి గీతాలు, భాగవతారిణి హరికథా కాలక్షేపం నిర్వహించారు. కళాకారులకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రశంసాపత్రాలు అందించారు.